## క్లుప్తంగా

### ఘనంగా ఆరాధనోత్సవాలు



పూజలందుకుంటున్న ముద్దురంగా గురుస్వాములు

**పెద్దకడబూరు:** మండల కేంద్రంలో వెలసిన గంజెళ్ల వెంకటాగురు శిష్యుడైన ముద్దురంగా గురువుల 139వ గురుపూజ ఆరాధనమహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గంజహల్లి వెంకటగురువుల మఠం అధ్యక్షుడు కృష్ణమూర్తిస్వామి ఆశీర్వాదాలతో వైశాఖ శుద్ధ అష్టమి బుధవారం రాత్రి గురుపూజ, మంగళ హారతులు, తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం రాత్రి చేపట్టిన భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

**నేడు పుణ్య గణారాధన**

గురువారం ఉదయం ముద్దురంగా గురుస్వామికి మఠం పీఠాధిపతులు వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు వంటి ప్రత్యేక పూజలు చేపడుతారు. సాయంత్రం స్వామివారి పుణ్యగణారాధన, పల్లకీ సేవ, నందికోలసేవ, గురువుల ప్రవచనం అనంతరం అఖండ భజన కార్యక్రమంలతో స్వామివారి మేలుకొలుపు జరుగుతుందని నిర్వాహకులు మఠం రంగప్పస్వామి తెలిపారు.

### ఖరీఫ్‌కు సన్నద్ధం



ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి దున్నుతున్న రైతన్న

**కోసిగి:** జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. ముందస్తుగా ఈనెల 13న వేకువజామున 3 గంటల నుంచి 7 గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ బోర్లు ఉన్న రైతన్నలు ముందస్తుగా ట్రాక్టర్లను బాడుగ పెట్టుకుని పొలాలను దుక్కి దున్ని చదును చేస్తున్నారు. గతేడాది వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు చేతికి రాక రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ముందుగానే వర్షం కురవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆశతో వ్యవసాయ పనులు మొదలుపెట్టారు.

### కౌతాళంలో 84 శాతం పోలింగ్ నమోదు

**కౌతాళం:** మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 69 మంది పోలింగ్ బూతుల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84.44 శాతం పోలింగ్ కావడం ఇది మొదటిసారి కావడం గమనార్హం. ఇంత పెద్దస్థాయిలో ఓటర్లు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును ఉపయోగించుకోవడం శుభపరిణామం అని అధికారులు పేర్కొన్నారు. మండలంలో 58,544 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 28610 మంది కాగా, మహిళా ఓటర్లు 29925 మంది ఉన్నారు. 9 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో పురుషులు 24699 మంది, మహిళలు 24734 మంది, ఇతరులు ఇద్దరు కలుపుకుని మొత్తం 49435మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా మేళిగనూరులో 92.81, తిప్పలదొడ్డిలో 92.08, డంబలదిన్నె 92.02, గోతులదొడ్డిలో 91.65 పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

### వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన అనసూయమ్మ

**హొళగుంద:** స్థానిక పోలీస్టేషన్ పరిధిలోని వందవాగిలి గ్రామానికి చెందిన గొల్ల అనసూయమ్మ (30) బుధవారం కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. సదరు మహిళకు 13 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. అనసూయమ్మ ఆరు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం విపరీతంగా నొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అనసూయమ్మ మరణించినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఆలూరు రూరల్:** ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సూరప్ప బుధవారం తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రెస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 10 తేదీ సాయంత్రం 5 గంటల్లోపు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# వేసవిలో నిప్పుతో తస్మాత్ జాగ్రత్త

- అవగాహన, అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ
- ఏడాదికాలంలో ఆదోని నియోజకవర్గంలో 115 అగ్ని ప్రమాదాలు
- రూ.5,04,44,000 ఆస్తి నష్టం
- రూ.11,23,35,000 ఆస్తిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్ ఫోటో)



ఆదోని అగ్నిమాపక కేంద్రం

**ఆదోని అర్బన్:** వంటగది, పంటచేను, షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, కార్యాలయాలు, స్టోరేజీలు, పెట్రోల్ బంకులు ఇలా స్థలం ఏదైనా సరే అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎందుకంటే వేసవి ముదిరిపోయింది. ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. సూర్యుడు భగ్గుమంటున్నాడు. ఈ యేడాది వేసవి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. అగ్ని ప్రమాదాల వల్ల ఆస్తినష్టంతో పాటు ఒక్కోసారి ప్రాణనష్టం కూడా జరుగుతుంది. వేసవి ముగిసేవరకు ప్రజలతో పాటు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం**

సహజంగా వేసవిలో అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. గ్రామాల్లో ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం రైతు పొలంలో ఉన్న గడ్డి, పంట వ్యర్థాలకు నిప్పు పెడుతుండడం గత కొన్నేళ్లుగా జరుగుతోంది. పంట పొలాల్లో నిప్పు పెట్టడం వల్ల భూసారానికి నష్టం కలుగుతుందని చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. దీని వల్ల గాలికి నిప్పురవ్వలు ఎగిరి సమీపంలో ఉన్న గడ్డివాములు, ఇళ్లపై పడితే మంటలు చెలరేగే ప్రమాదం ఉంటుంది. పట్టణ ప్రాంతంలో ప్రధానంగా ఎండ తీవ్రతను తట్టుకునేందుకు షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, ఇతర వ్యాపార సముదాయాలతో పాటు నివాసాల్లో ఏసీలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. అగ్ని ప్రమాదం ఎలా జరిగినా ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లుతుంది.

**ఏటా అగ్నిమాపక వారోత్సవాలు**

వేసవిలో జరిగే అగ్ని ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. 1994 ఏప్రిల్ 14వ తేదీన ముంబైలోని ఓడరేవులో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనకు గుర్తుగా ఏటా ఈ దినోత్సవాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు.

**స్కూల్స్, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్‌లో భద్రతా సౌకర్యాలు**

పాఠశాలలు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్‌లో పైకప్పులు ఆర్‌సీసీ, కాంక్రీట్ స్లాబ్‌లు మాత్రమే ఉండాలి. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్‌లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. సెల్లార్‌లలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్‌లను ఉపయోగించాలి. పాఠశాల, ఆస్పత్రి, షాపింగ్ మాల్స్‌లో తప్పించుకునేందుకు సరైన ప్రణాళిక వేసి అందరికీ అవగాహన కల్పించాలి. షాపింగ్ మాల్స్‌లో విద్యుత్ సామగ్రిని ఐఎస్ఐ మార్క్ కలిగిన వాటిని మాత్రమే వాడాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు గానీ, స్థానికంగా 08512–252299కు సమాచారం అందించాలి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు అగ్ని ప్రమాదం సంభవించకుండా మినీ ఏచర్ సర్క్యూట్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేయాలి.

**నియోజకవర్గంలో 115 అగ్ని ప్రమాదాలు**

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మే (15వ తేదీ వరకు) ఆదోని నియోజకవర్గంలో 115 అగ్ని ప్రమాదాలు జరిగాయి. అందులో ఒకటి రెస్క్యూ, తీవ్రస్థాయిలో మూడు అగ్ని ప్రమాదాలు, మధ్యస్తంగా 8 అగ్ని ప్రమాదాలు, 103 చిన్న అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో రూ.5,04,44,000 ఆస్తినష్టం జరిగినట్లు అంచనా. రూ.11,23,35,000 ఆస్తిని అగ్ని ప్రమాద సిబ్బంది కాపాడారు. అందులో ఇళ్లకు సంబంధించిన ప్రమాదాలు 10, ఒకటి గోడౌన్, ఒకటి విద్యుత్ ప్రమాదం, పరిశ్రమల్లో 10 ప్రమాదాలు, దుకాణాలు, కార్యాలయాల్లో 17, ఆస్పత్రిలో ఒక ప్రమాదం, 9 ప్రమాదాలు ఫారెస్టుల్లో చెట్లకు నిప్పు అంటుకోవడం, వాహనాలకు అగ్ని ప్రమాదాలు–8, గడ్డివాముల ప్రమాదాలు 57 సంభవించాయి.


#### అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

- వంటింటికి గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌లను తక్షణమే మార్చాలి. ఐఎస్ఐ మార్క్ కలిగిన కొత్త ట్యూబ్‌లను వేసుకోవాలి.
- ఎల్‌పీజీ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే రెగ్యులేటర్‌ను తీసి క్యాప్ బిగించాలి.
- వంటగదిలో పెట్రోల్, డీజిల్, అదనపు గ్యాస్ సిలిండర్‌ను ఉంచరాదు.
- గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే గడ్డివాములుగా వేసుకోవాలి. గడ్డివాములు నివాస ప్రాంతాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి.
- గోదాముల్లో స్టాకును చెక్ క్లీపర్‌లపై మాత్రమే నిల్వ చేయాలి. నిల్వల మధ్యలో గ్యాంగ్‌వే, క్రాస్ సెక్షన్లు ఉంచాలి. వస్తువుల నిల్వలు ఎక్కువగా ఉంచకూడదు. ట్రక్కుల ఇంజిన్లు ఆఫ్ చేసి వస్తువులను లోడింగ్ చేయాలి. కర్మాగారాల పరిసరాల్లో చెత్తా చెదారం నిల్వ ఉంచకూడదు.
- గోదాముల్లో పనిచేసే ఉద్యోగులకు ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ ఇవ్వాలి. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలి. మిషనరీ, బెల్టులు, విద్యుత్ పరికరాల నుంచి నిప్పురవ్వలు ఎగసిపడకుండా జాగ్రత్తలు వహించాలి.

**నివారణ పద్ధతులు ఇవీ**

- ఇంట్లో వస్తువులను అలమారాల్లో, సెల్ఫ్‌స్‌లో సక్రమంగా సర్దుకొని ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలి.
- చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, ఇతర మండే వస్తువులను, పేలుడు పదార్థాలను అందుబాటులో ఉంచరాదు. కాల్చిన సిగరెట్లు, చుట్టలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా బయట పడేయరాదు.
- ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలను ఉపయోగించాలి.
- పాడైన వైర్లను వాడరాదు. ఓవర్‌లోడ్ పడకుండా చూడాలి.
- ఎలక్ట్రికల్ ప్యాకెట్‌లో కెపాసిటీకి తగిన ప్లగ్ సాకెట్లను మాత్రమే వాడాలి.
- ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటికి వెళ్లినప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేయాలి.
- అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పడానికి నీటిని ఇంట్లో ఉంచాలి. బ్రేకర్స్‌ను అమర్చుకోవాలి.

#### వెంటనే సమాచారం ఇవ్వాలి



అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే 101 లేదా 08512–252299 నంబర్‌లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. గతేడాది కన్నా ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్నాయి. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలి. అగ్ని ప్రమాదాలను అదుపు చేయడంతోపాటు ప్రమాదాలపై ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైన వారికి శిక్షణ ఇస్తున్నాం. ముఖ్యంగా వేసవిలో కేర్‌లెస్ స్మోకింగ్‌ను నియంత్రించాలి. ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు దరిచేరవు.

– రామాంజనేయులు,
అగ్నిమాపక శాఖ ఆదోని ఇన్‌చార్జ్

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ఆదోని రూరల్:** మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో అబ్బుహుసేన్ పీరా అనే వ్యక్తి బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వెంటనే కాంట్రాక్టర్ బసవరాజు ద్వారా రూ.5 వేలను బాధిత కుటుంబానికి అందించారు. కాంట్రాక్టర్ బసవరాజు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అబ్బుహుసేన్ పీరా మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నహనుమంతప్పరెడ్డి, తాహేర్‌బాషా, నాగరాజుగౌడ్, మౌలా, హాజీ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

### పైప్‌లైన్ ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి

**గోనెగండ్ల:** మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామంలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌కు నీటి సరఫరా చేసే మంచినీటి పైపులైన్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ రంగారెడ్డి కోరారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. గ్రామంలో కడివెళ్ల వంక నుంచి పైగేరి నందు ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకుకు వచ్చే పైపులైన్‌ను కొందరు వ్యక్తులు రెండు రోజుల క్రితం ధ్వంసం చేశారన్నారు. దీంతో ట్యాంక్‌కు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. వేసవి కాలంలో మంచినీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి సమయంలో పైపులైన్ ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇకపై ఎవరూ ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించకుండా, పైపులైన్ ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

### అడిగిన వారందరికీ ఉపాధి కల్పిస్తాం

**ఎమ్మిగనూరురూరల్:** మండలంలో పనులు కావాలని అడిగిన వారందికి ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని ఏపీఓ విజయమోహన్ పేర్కొన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనుల్లో 4300 మంది కూలీలు పనికి వచ్చారని తెలిపారు. వర్షం కారణంగా కొన్ని చోట్ల పనులు నిలిచిపోయినా నేటి నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు మొదలు పెడతామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# శివారు కాలనీలలో సమస్యల పరిష్కారం



క్రాంతినగర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



ఆర్‌ఆర్ లేబర్ కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్ నుంచి ఆలూరు రహదారి వరకు బీటీ రోడ్డు

**ఆదోని సెంట్రల్:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు సమప్రాధాన్యత ఇవ్వడంతో ఆదోని శివారు కాలనీలలో అభివృద్ధి జోరందుకుంది. గత టీడీపీ హయాంలో పట్టణ శివారు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయా కాలనీల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించింది. క్రాంతినగర్ కాలనీలో గతంలో సరైన రహదారి, డ్రైనేజీ వంటి సౌకర్యాలు లేక రహదారులు అస్తవ్యస్తంగా ఉండేవి. దీంతో అక్కడక్కడా గుంతలు ఏర్పడి కంకర తేలి రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడేవారు. మురుగునీరు పారేందుకు డ్రైనేజీ సౌకర్యం లేక రోడ్లపైకి చేరి అస్తవ్యస్తంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎర్పడ్డాక 24వ వార్డు సచివాలయం పరిధిలోని కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ నిర్మాణాల కొరకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి పంపారు. స్పందించిన ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. దీంతో క్రాంతినగర్‌లో రూ.11 లక్షలతో సీసీ రహదారులు, రూ.9.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద నుంచి ఆలూరు రోడ్డు వరకు రూ.1.40 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రజల రాకపోకలతో పాటు రైళ్లలో వచ్చే సబ్సిడీ బియ్యాన్ని ఆయా ప్రాంతాలకు చేరవేయడానికి అనుకూలంగా మారింది. క్రాంతినగర్ కాలనీ నుంచి ఆర్‌ఆర్ లేబర్ కాలనీకి రావాలంటే మధ్యలో మురుగు కాలువ ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. సమస్య పరిష్కరించేందుకు మురుగు కాలువపై రూ.35 లక్షలతో కల్వర్టును ఏర్పాటు చేశారు. కాలనీలో సరైన రహదారులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను గుర్తించి రూ.27 లక్షలతో సీసీ రహదారుల పనులను చేపట్టారు. కాలనీలోని మురుగునీరంతా ఒక చోటకు చేర్చి అక్కడినుండి మెయిన్ డ్రైనేజీ కాలువలో కలిసే విధంగా పనులు చేపట్టారు. కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మురుగు కాలువపై కల్వర్టు నిర్మాణం



క్రాంతినగర్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ

## కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతులు



విద్యార్థులతో బుక్ రీడింగ్ చేయిస్తున్న గ్రంథాలయాధికారిణి కె.సుజాత

**ఆదోని అర్బన్:** ఆదోని శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి కె.సుజాత బుధవారం తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థినీ, విద్యార్థులకు నీతికథలు చెప్పడం, విద్యార్థులచే సారాంశం చెప్పించడం, బుక్ రీడింగ్, చిత్రలేఖనం, పెయింటింగ్, యోగా, ఆటలు, డాన్స్ తదితర తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ (భయాన్ని) పోగొట్టడం, వారిలోని మేధాశక్తిని పెంపొందించడం, వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్ది చైతన్యవంతులుగా చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పెరిగిన పోలింగ్ శాతం

**ఎమ్మిగనూరుటౌన్:** ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలో 2019 ఎన్నికల్లో 79.65 శాతం పోలింగ్ నమోదు కాగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 81.97 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. నియోజకవర్గంలో 2,47,752 మంది ఓటర్లుండగా అందులో 2,03,086 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 1,01,914 మంది పురుషులు, 1,01,153 మంది మహిళలు ఓట్లు వేయగా ట్రాన్స్‌జెండర్స్ 19 మంది ఓటు వేశారు. ఎమ్మిగనూరు పట్టణంలో గత ఎన్నికల్లో 70.37 శాతం ఓటింగ్ నమోదుకాగా ఈ సారి ఎన్నికల్లో 74 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలోని నెరడుప్పుల గ్రామంలో అత్యధికంగా 96.41శాతం ఓటింగ్ నమోదు కాగా ఎమ్మిగనూరు పట్టణంలోని 86వ పోలింగ్ బూత్‌లో అత్యల్పంగా 56.24 శాతం ఓటింగ్ నమోదైంది.

**గోనెగండ్ల మండలంలో..**

**గోనెగండ్ల:** సార్వత్రిక ఎన్నికలు గోనెగండ్ల మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసినా మండలంలోని గోనెగండ్ల, ఐరన్‌బండ తదితర గ్రామాల్లో ఈవీఎంల మొరాయింపు, పోలింగ్ సరళి నిదానంగా సాగడం తదితర టెక్నికల్ సమస్యలు తలెత్తడంతో రాత్రి 9 గంటల వరకు ఓటర్లు వేచి ఉండి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గోనెగండ్ల మండలంలో 58,866 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 25,684 మంది పురుషులు, 24,613 మంది స్త్రీలు, ఇతరులు ఒక్కరు మొత్తం 50,298 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 85.44 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ పార్వతి బుధవారం తెలిపారు. 2019 ఎన్నికలలో 75 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం ఏకంగా 10 శాతం అధికంగా పోలింగ్ నమోదు కావడం గమనార్హం.

## వలంటీర్ల రాజీనామాల పర్వం

- ఇప్పటివరకు 437 మంది వలంటీర్ల రాజీనామా

**ఆదోని టౌన్:** ఆదోని మున్సిపాలిటీలో 437 మంది వార్డు వలంటీర్లు వ్యక్తిగత కారణాలచేత తమ విధులకు రాజీనామా చేశారు. పట్టణంలో 643 క్లస్టర్లు ఉండగా అందులో 627 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు వలంటీర్లపై కక్షగట్టి తన జేబు సంస్థ ద్వారా ఫిర్యాదు చేయించి వారిసేవలను అడ్డుకోవడంతో మనస్తాపం చెంది రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఆదోని మున్సిపాలిటీలో 627 మందికిగానూ 437 మంది రాజీనామాలు చేశారు. 190 మంది వలంటీర్లు విధుల్లో కొనసాగుతున్నారు. ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని ఏప్రిల్, మే మాసాల్లో పింఛన్‌దారులకు వలంటీర్ల చేత సొమ్ము పంపిణీ చేయరాదని చంద్రబాబునాయుడు ఎన్నికల కమిషన్ ద్వారా ఆదేశాలు వచ్చేలా చేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచంపట్టి జబ్బులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంత మంది పింఛన్లు తీసుకునేందుకు వెళ్తూ ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురై మృతిచెందిన ఘటనలు కూడా ఉన్నాయి. తమ ఉసురు చంద్రబాబునాయుడికి తగలకుండా పోతుందా అంటూ ఆ కుటుంబాల వారు, వలంటీర్లు శాపనార్థాలు పెడుతున్నారు. రాజకీయం రాజకీయంగానే చూడాలే తప్పా చిన్నపాటి ఉద్యోగులు, స్వచ్ఛందంగా పనిచేస్తున్న వలంటీర్లపై ప్రతాపం చూపడం రాజకీయం అనిపించుకోదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

## చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు

**చిప్పగిరి:** మండలకేంద్రం నుంచి దౌల్తాపురం, నంచర్ల మీదుగా మద్దికెర వరకు రూ.10 కోట్లతో 12 కి.మీ మేర చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మట్టి చదును పనులు దౌల్తాపురం గ్రామం వరకు పూర్తయ్యాయి. బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే ముఖ్యంగా నంచర్ల, దౌల్తాపురం గ్రామ ప్రజలకు మండల కేంద్రానికి చేరుకోవడానికి 40 కి.మీ దూరం తగ్గనుంది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంతో నంచర్ల, దౌల్తాపురం గ్రామ ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

## ల్యాబ్ పరికరాలు ధ్వంసం

**కృష్ణగిరి:** కంబాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ల్యాబ్ పరికరాలను ధ్వంసం చేసినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ కడ్డీలను తొలగించి రూ.3 లక్షల విలువ చేసే ల్యాబ్ పరికరాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం కోరారు.

## నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



**కృష్ణగిరి:** మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను గురువారం నుంచి నాలుగు రోజులపాటు వైభవంగా జరుగున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాతం, వేదపారాయణం, పంచబ్రహ్మ ఉపనిషత్తు పారాయణంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయి. 9 గంటలకు కుంకుమార్చన, 11 గంటలకు కలశతీర్థం, రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల కళ్యాణం, 9 గంటలకు బ్రహ్మంగారి ఉచిత నాటక ప్రదర్శన ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. 17న వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన గురుపూజ మహోత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు నందికోల ప్రభోత్సవం, ముత్యాల తేరుపై ఉత్సవాలు ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

**17న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు**

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా 17న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విజేత జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ.10వేలు చొప్పున అందిచడం జరుగుతుందన్నారు. అదే విధంగా 18న పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన ఎద్దుల యాజమానులకు రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ5వేలు చొప్పున బహుమతులు అందించనున్నారు. 19న న్యూ కేటగిరి విభాగంలో బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. విజేత వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ10వేలు చొప్పున దాతల సహకారంతో అందిస్తామన్నారు.

## ఉపాధి కూలీపై దున్నపోతు దాడి



చికిత్స పొందుతున్న తలారి గౌరమ్మ

**చిప్పగిరి:** ఉపాధి పనులకు వెళుతున్న ఓ మహిళపై దున్నపోతు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న తలారి గౌరమ్మ ఉదయం ఉపాధి పనికి వెళుతుండగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఓ దున్నపోతు దాడి చేసింది. గమనించిన తోటి కూలీలు దున్నపోతును తరమడానికి ప్రయత్నించగా రెచ్చిపోయిన దున్నపోతు మరోసారి గౌరమ్మపై కొమ్ములతో దాడి చేసింది. స్థానికులు దున్నపోతును తరిమేశారు. తీవ్రంగా గాయపడిన గౌరమ్మను కుటుంబసభ్యులు గుంతకల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు